క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన విద్య



గార్ల: అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని గార్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.గోవిందరావు అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లకుండా అన్ని వసతులు కలిగిన గార్ల కళాశాలలో చేర్పించాలని తల్లితండ్రులకు సూచించారు. ఈ సదస్సులో అధ్యాపకులు వేముల రవీందర్, శ్రీనివాసరావు, సోమన్న, నాగేశ్వరరావు, జోగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



తొర్రూరు: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా పాలకవర్గ ప్రతినిధి డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని వికాస్ హైస్కూల్‌లో రక్తదానంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రేగూరి వెంకన్న, కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు తమ్మెర విశ్వేశ్వరరావు, లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ సారథి వెంకన్న పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నెహ్రూసెంటర్: మున్నూరుకాపు పటేల్స్ అసోసియేషన్ జిల్లా కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పిట్టల బుచ్చిరామారావు, ప్రధాన కార్యదర్శిగా పిట్టల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు, శ్రీనివాస్, మద్దెల రమేష్, ఆవుల కుమార్, పిట్టల చంద్రశేఖర్, బోళ్ల జగ్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



మహబూబాబాద్/గార్ల: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ప్రపంచ రక్తదాతల రోజు పురస్కరించుకొని ఎక్కవసార్లు రక్తదానం చేసిన ఐఆర్‌సీఎస్ మానుకోట శాఖకు చెందిన గొర్రె వెంకన్నకు రాష్ట్రస్థాయి అవార్డు అందజేసినట్లు ఐఆర్‌సీఎస్ మానుకోట చైర్మన్ పి.వరప్రసాద్ తెలిపారు. అవార్డులను మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గవర్నర్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా అందుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతుల కారణంగా పలు గ్రామాలకు నేడు(శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కురవి సెక్షన్ విద్యుత్ శాఖ ఏఈ శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కురవి, అయ్యగారిపల్లి, నల్లెల్ల, మోద్గులగూడెం, తిర్మలాపురం, రేకుల తండా జీపీ పరిధిలోని రామచంద్రాపురం, లింగ్యా తండా, తులిస్యాతండాలకు నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గూడూరులో..

గూడూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ప్రణీత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలను తెరిపించాలి

కురవి: సీరోలు మండలంలోని కొత్తూరు(సీ) శివారు గుజిలి తండాలో ప్రాథమిక పాఠశాలను తెరిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు ఆధ్వర్యంలో శుక్రవారం డీఈఓ రామారావుకు మానుకోటలోని కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిప్పరపల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న ఖరీఫ్

- మండలానికి రాని విత్తన ప్యాకెట్లు
- కానరాని రైతు చైతన్యయాత్రలు
- మూడేళ్ల నుంచి వ్యవసాయ పనిముట్ల పంపిణీ లేదు
- ఆందోళన చెందుతున్న రైతులు



దుక్కి దున్నుతున్న రైతు

గార్ల: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని, రైతేరాజని అన్నదాతను అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రచారం చేస్తున్న పాలకులు ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా, రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర వ్యవసాయశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. ప్రతీ ఏడాది ఖరీఫ్‌కు రైతులను చైతన్య పరిచేందుకు మేలో ప్రతీ గ్రామంలో వివిధ రకాల పంటల సాగు వివరాలను తెలిపేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో రైతు చైతన్యయాత్రలు గత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టేది. గత 6ఏళ్ల నుంచి మేనెలలో రైతు చైతన్యయాత్రలు చేపట్టక పోవడంతో రైతులు పంటల సాగుపై ఆందోళన చెందుతున్నారు.

విత్తనాలు రాలేదు

చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై పత్తి, మిర్చి, వరి విత్తనాలు, యంత్ర లక్ష్మి పథకం ద్వారా వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందించి ప్రోత్సహించాల్సిన పాలకులు మూడేళ్ల నుంచి రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయడం లేదు. గార్ల మండలంలో సుమారు 6వేల ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేస్తుంటారు. ఇందుకు 2వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. కానీ ఇప్పటి వరకు జీలుగ విత్తనాలు తప్ప వేరే విత్తనాలు వ్యవసాయ కార్యాలయానికి రాలేదు.

5వేల ఎకరాల్లో పత్తిసాగు

మండలంలో 5వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. సుమారు 6వేల ప్యాకెట్లు పత్తి విత్తనాలు అవసరం ఉండగా, వ్యవసాయ కార్యాలయానికి మాత్రం ఒక్క ప్యాకెట్ కూడా రాలేదు. విత్తన డీలర్ల దుకాణాల్లో మాత్రమే పత్తి ప్యాకెట్లు లభ్యమవుతున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం నుంచి ఐటీడీఏ ద్వారా వ్యవసాయ కార్యాలయానికి పత్తి, మిర్చి విత్తనాలు సరఫరా చేయక పోవడంతో గిరిజన రైతులు విత్తన డీలర్ల దుకాణాల్లో విత్తనాలు కొనుగోళ్లు చేసుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. మండలంలో మిర్చి సుమారు 3వే ఎకరాల్లో, పత్తి 5వేల ఎకరాల్లో, 400 ఎకరాల్లో మొక్కజొన్న, 550 ఎకరాల్లో పెసర, 1000 ఎకరాల్లో కంది పంటలు సాగు చేస్తుంటారు.

రాయితీపై అందించాలి

ఖరీఫ్ సాగుకు ముందే వ్యవసాయ అధికారులు ప్రణాళికను రూపొందించి విత్తనాల కోసం ప్రభుత్వానికి ఇండెంట్‌ను పంపారు. అయినా వ్యవసాయ కార్యాలయానికి పత్తి, మిర్చి విత్తనాలు రాకపోవడంతో రైతులు ప్రైవేట్ విత్తన డీలర్ల దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని గిరిజన రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయ అధికారి స్పందించి వ్యవసాయ కార్యాలయం ద్వారా రైతులకు సరిపడా వరి, పత్తి, మిర్చి విత్తనాలు రాయితీపై అందేలా చర్యలు చేపట్టాలని గిరిజన రైతులు కోరుతున్నారు. ఈవిషయంపై మండల వ్యవసాయ అధికారి రామారావును 'సాక్షి' వివరణ కోరగా గత కేసీఆర్ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో రైతు చైతన్య యాత్రలు నిర్వహించడంలేదు. ఐటీడీఏ ద్వారా గత 6ఏళ్ల నుంచి గిరిజన రైతులకు రాయితీపై పత్తి, మిరప విత్తనాలు రావడం లేదన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుతో తీరనున్న సమస్య



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: పారిశ్రామిక కేంద్రమైన కేసముద్రం మండల కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50కోట్ల నిధులతో మంజూరు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య తీరనుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రానికి మంజూరైన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో గల ఖాళీ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సబ్‌స్టేషన్‌తో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. కాగా సబ్‌స్టేషన్ ఏర్పాటుపై డీఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ దామోదర్‌తో ఎమ్మెల్యే చర్చించి, స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు వెంకన్న, కదిర సురేందర్, తరాల వీరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పంట రుణాలు ఇవ్వాలని ధర్నా



కురవి: ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

కురవి: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు పంట రుణాలు మాఫీ చేసి కొత్తగా రుణాలు ఇవ్వాలని శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నల్లపు సుధాకర్ మాట్లాడుతూ.. రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిందని, పంట రుణాలను మాఫీ చేయాలని, కొత్తగా తిరిగి రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండబత్తుల వెంకన్న, కట్ల కృష్ణయ్య, బత్తిని వీరభద్రం, ఇరుగు సత్యం, బత్తిని వెంకన్న, గుగులోత్‌బిచ్చానాయక్, చిలకమ్మ, బానోత్ సునీత, శంకర్, సాల్కి, రాజన్న పాల్గొన్నారు. అనంతరం బ్యాంకు అధికారికి వినతిపత్రం అందజేశారు.

తొర్రూరు: రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్‌రెడ్డి అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. రుణాలు మంజూరు చేయాలని కోరుతూ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరుణంలో పాత రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం అశోక్, తాళ్ల వెంకటేశ్వర్లు, వీరన్న, యాకన్న, వెంకన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మహబూబాబాద్ రూరల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



తొర్రూరు రూరల్: వెంకటాపురంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీఓ

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ సిలార్ సాహెబ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపాల్, హెచ్‌ఎం స్వాతి, దాతలు మొగుళ్ల అఖిల్, ఆకాష్, పంచాయతీ కార్యదర్శి సుమన్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మాధవి, వీఓఏ రజిత, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని పర్వతగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పంజాల లింగమూర్తి, ఉపాధ్యాయులు సుమీలారాణి, గీత, మమత, భాగ్యమెర్సీ, రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

మరిపెడ: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం అనంతరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

మరిపెడ రూరల్: మండలంలోని గాలివారిగూడెం యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు దాత నారెడ్డి కవితసుదర్శన్‌రెడ్డి తన సొంత ఖర్చులతో రూ.5వేల విలువ గల నోట్ పుస్తకాలు, పలకలు, బలపాలు, పెన్నులు, పెన్సిళ్లు శుక్రవారం అందజేశాడు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.వెంకన్న, ఉపాధ్యాయులు మురళీధర్, వెంకన ఫైజుద్దీన్, బాలు, లింగల మహేష్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయితండా, పెద్దతండా జీపీ, బంగారుగూడెం జీపీతోపాటు చౌళ్ల తండా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పీడీఎస్‌యూ నాయకుడు బానోత్ దేవేందర్ శుక్రవారం పుట్టినరోజు సందర్భంగా సొంత ఖర్చులతో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశాడు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయ్‌నాయక్, సుధాకర్, శ్రీదేవి, లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు పలకలు..

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించగా స్ఫూర్తి ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్ బాబు, హెచ్‌ఎం లక్ష్మి, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సంస్థ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, అలివేలు, కృష్ణవేణి, ఉపాధ్యాయలు శ్రీనివాస్, రవికుమార్, లక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న రైతులు

నెల్లికుదురు: గుంతలతో బురదమయమైన రోడ్డుకు గ్రామస్తులు సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించిన సంఘటన మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో శుక్రవారం జరిగింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామగిరి గ్రామం నుంచి ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే రహదారి ఎన్నో ఏళ్ల నుంచి గుంతలుపడి బురదమయంగా ఉంది. రైతులు ప్రజాప్రతినిధులు, అధికారులతో మొరపెట్టుకున్న పట్టించుకోలేదు. దీంతో చేసేదేమిలేక రైతులంతా కలసి సొంత ఖర్చులతో తాత్కాలిక మరమ్మతులు చేసుకున్నారు. కార్యక్రమంలో రైతులు మాదరి ప్రశాంత్, అశోక్, యాదగిరి, కృష్ణ, చంద్రయ్య, శ్రీశైలం, వినోద్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, రంజిత్, సాయి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి సారించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిసి పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, హరికృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న మహిపాల్

పెద్దవంగర: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వాధ్యులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా పెట్టుకోవాలని పల్లె దావాఖాన వైద్యుడు మహిపాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామసభ నిర్వహించారు. గ్రామాధికారులతో గ్రామ స్పెషల్ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించుకున్నారు. గ్రామంలో అవసరమై పనులపై తీర్మానాలు చేశారు. ఈసందర్భంగా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కురుస్తున్న వర్షాలకు గ్రామంలో నీరు నిల్వ ఉంటుందని, దీంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. కాచి వడబోసిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి వెంకన్న, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, స్థానికులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



నర్సింహులపేట: ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు

కేసముద్రం: మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గాండ్ల అశోక్, అతడి భార్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఒంటరైన దంపతుల కూతురు శివాణి నర్సంపేటలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుంది. ఈ మేరకు కేసముద్రంస్టేషన్ ఎస్‌వీవీకి చెందిన 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు శివాణిని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నారు. శుక్రవారం బాలికకు స్కూల్, వ్యాన్ ఫీజు, నోట్‌బుక్స్, బ్యాగ్ ఖర్చులకు రూ.45వేలను చెల్లించినట్లు బాల్యమిత్రులు తెలిపారు. కార్యక్రమంలో వోమ సంతోష్, జలగం అనిల్, సామల రమేష్, వేం సతీష్, గురువురాగి సోమనర్సయ్యచారి పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రానికి చెందిన మంచినీళ్ల రవీందర్‌రెడ్డి (ఆర్టీసీ ఉద్యోగి) అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందడంతో 1984–85 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మృతుడి స్నేహితులు శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఉదయపాల్, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాసరాజు, రుద్ర, శ్రీనువాస్, యాకయ్య, మాదవరావు, శ్రీనువాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బిక్షంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అందని వేతనాలు



నిరసన తెలుపుతున్న కార్మికులు

నెల్లికుదురు: పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇనంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వరకు కార్మికులతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేసి ఎంపీడీఓ బాలరాజుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి రోజు పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 3నెలల నుంచి 12 నెలల వరకు వేతనాలు అందడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లను తొలగించి పారిశుద్ధ్య కార్మికులను నియమించడంతో పని భారం పెరిగిందన్నారు. కార్యక్రమంలో కార్మికులు బి.ఎల్లయ్య, తూళ్ల ఎల్లయ్య, వెంకన్న, నర్సయ్య, కృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు, బంధువులు

గూడూరు: లారీ ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, లారీ డ్రైవర్, యజమానిపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పడిగె నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్ మూలమలుపు వద్ద శుక్రవారం లారీ పల్టీకొట్టగా మచ్చర్లకు చెందిన చుంచ దేవేందర్ (34), మట్టెవాడ శివారు కొంగరగిద్దకు చెందిన దనసరి పాపారావు (35) మృతి చెందగా, మండల తుడుందెబ్బ ఆధ్వర్యంలో ప్రధాన హైవేపై రాస్తారోకో చేపట్టారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని, లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

పరీక్షల నిర్ణయాన్ని విరమించుకోవాలి

నెహ్రూసెంటర్: ఆశ కార్యకర్తలకు పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ నిర్వహించిన ధర్నాతో ప్రభుత్వం స్పందించి ఇచ్చిన వివరణలో పరీక్ష వలన కలిగే ప్రయోజనాలు ఏమిటో చెప్పకపోవడం ఆశాలను ఆందోళనకు గురి చేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేసు నమోదు

గార్ల: మండలంలోని బుద్దారంతండాలో అక్రమంగా గుడుంబా అమ్ముతున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని బుద్దారం తండాకు చెందిన వాంకుడోత్ భారతి, వాంకుడోతు తార తమ ఇళ్లలో అక్రమంగా గుడుంబా అమ్ముతుండగా 13 లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లంపానకంను స్వాధీనం చేసుకొని ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెడ్యాలలో బడిబాట

మహబూబాబాద్ రూరల్: మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట నిర్వహించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి బద్రినాథ్ ఎన్‌ఎస్‌ఎస్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి శుక్రవారం తెలిపాడు. కార్యక్రమంలో శ్రీదేవి, సురేష్, సురేందర్‌గుప్తా పాల్గొన్నారు.

అసత్య ప్రచారం సరికాదు

తొర్రూరు రూరల్: మాజీ మంత్రి దయాకర్‌రావు బీఆర్‌ఎస్ వీడడని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ తెలిపారు. కేసీఆర్‌కు విధేయుడిగా ఉన్న దయాకర్‌రావు పార్టీ మారుతాడని పలువురు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు.

సక్రమంగా నీటిని సరఫరా చేయాలి

నర్సింహులపేట: మిషన్ భగీరథ నీటిని ప్రతి ఇంటికి సక్రమంగా సరఫరా చేయాలని డీఎల్‌పీఓ పుల్లారావు అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సింహులపేట, కొమ్ములవంచ, కౌసల్యదేవిపల్లి, పెద్దనాగారం స్టేజీ గ్రామాల్లో ఆయన పర్యటించి నీటి సరఫరా తీరుపై ఇంటింటికి తిరిగి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎంపీ పూజలు

మరిపెడ: మండలంలోని రామాలయంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరిపెడ ఆయన స్వగ్రామం కావడంతో పూజలు చేశారు.

పోషకాహారం అందించాలి

నెల్లికుదురు: అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు నాణ్యమైన పోషక ఆహారం అందించాలని ఎంపీడీఓ బాలరాజు అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వివధ గ్రామాలల్లోని అంగన్‌వాడీ సెంటర్లు, మిషన్ భగీరథ నీటిపై ఇంటింటి సర్వే చేసి ఎంపీఓ పార్థసారథితో కలసి పరిశీలించారు.

ఫర్టిలైజర్ షాపు తనిఖీ

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని పెస్టీసైడ్స్, ఫెర్టిలైజర్ దుకాణాలపై స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ వీరాసింగ్ మాట్లాడుతూ.. సూర్యతేజ ఏజెన్సీస్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో బిల్లులు లేకుండా అమ్ముతున్న గడ్డి మందును స్వాధీనం చసుకున్నట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఉమ, ఏఈఓ శశికుమార్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళల ప్రవర్తన

కేసముద్రం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రాజస్తాన్‌కి చెందిన సుమారు 30మంది మహిళలు రోడ్డు వెంట వాహనాలను ఆపుతూ, డబ్బులు అడుగుతుండటంతో స్థానికులు వారి తీరుపై అనుమానం వ్యక్తం చేశారు. ఈమేరకు వారి ఫొటోలను తీసే ప్రయత్నం చేస్తుండగా వద్దంటూ వారించారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మహిళలను విచారించారు. కాజీపేట నుంచి విజయవాడ వైపునకు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా, తమ వద్ద గ్యాస్ సిలిండర్లు ఉండటంతో రైల్వే సిబ్బంది ఇక్కడ దింపారని, బొమ్మలను అమ్ముకుని జీవించే వాళ్లమని పోలీసులకు మహిళలు తెలిపారు.

విద్యుదాఘాతంతో దూడ మృతి

మరిపెడ రూరల్: విద్యుదాఘాతంలో శుక్రవారం ఆవు దూడ మృతి చెందింది. లూనావత్‌తండకు చెందిన రైతు బానోతు సైదులు తన పశువులను మేత కోసం గురువారం ఊరు శివారులోకి తీసుకెళ్లాడు. తెగిపడి ఉన్న విద్యుత్ తీగను దూడ తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

బీసీజీ శిక్షణపై అవగాహన

గూడూరు: మండలంలోని అయోధ్యపురం పీహెచ్‌సీలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు డాక్టర్ యమున ఆధ్వర్యంలో అడల్ట్ బీసీజీ శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ, 60 ఏళ్ల పైబడిన వారు ఎత్తుకు తగిన బరువుపై, టీబీ సోకిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఇంటింటికీ తాగునీరు

పెద్దవంగర: ఇంటింటికీ నల్లానీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వే తీరుతెన్నులను పరిశీలించారు.

బియ్యం వితరణ

దంతాలపల్లి: మండలంలో దొనకొండ గ్రామంలో ఇటీవల ట్రాక్టరు ప్రమాదంలో మృతి చెందిన నారాయణ సతీష్ కుటుంబ సభ్యులకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ శుక్రవారం 100కేజీల బియ్యం అందించాడు. మహేష్, సత్యనారాయణ, కొమురయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

శాంతిహోమం

గార్ల: గార్ల సమీపంలోని వేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత రాత్రి గాలి దుమారంతో ఆలయ ధ్వజస్తంభం కూలిపోవడంతో, దీనికి ప్రాయచ్ఛితంగా శుక్రవారం దేవాలయంలో వేదపండితులు శాంతిహోమం నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కేసముద్రం: మండలంలోని సబ్‌స్టేషన్‌తండాజీపీకి చెందిన మాజీ సర్పంచ్ గుగులోతు వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాడె మోశారు. ఇటీవల షాట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన ఆసుపత్రి, మెడికల్‌షాపును ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయం అందే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.